సాక్షి వరంగల్

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ఉపాధి కల్పించండి..

రైల్వే వ్యాగన్ పరిశ్రమకు పంట భూమి ఇచ్చి ఉపాధి కోల్పోయాం.. మాకు జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని అయోధ్యపురం రైతులు వేడుకుంటున్నారు. - 8లో▸



నమ్మించి నట్టేట ముంచి..

ఓ రైతు బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని ఇంటికెళ్తుండగా దుండగులు నమ్మబలికి రూ.40వేలు చోరీ చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత సాధారణంగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

కాంగ్రెస్‌లో కుంపటి

మంత్రి సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే రేవూరి

- 'గీసుకొండ' ఘటనపై టీపీసీసీ చీఫ్ ఆరా!?
- ఆ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి
- దసరా ఉత్సవాల్లో ఫ్లెక్సీ వివాదంతో మరింత అగాథం
- తాణాకు చేరిన అధికార నేతల వివాదం.. కేడర్‌లో అయోమయం
- తాజా పరిణామాలపై ఆరా తీసిన బొమ్మ మహేశ్‌కుమార్



సాక్షిప్రతినిధి, వరంగల్ : మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుల మధ్య నెలకొన్న ఫ్లెక్సీల వివాదం పార్టీలో కుంపట రాజేసింది. దీంతో ఓరుగల్లులో అధికార కాంగ్రెస్ పార్టీ తాజా రాజకీయాలపై టీపీసీసీ అధిష్ఠానం దృష్టి సారించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ జిల్లా అధ్యక్షుల మధ్య సమన్వయ లోపంపై దృష్టి సారించింది. ప్రధానంగా దసరా ఉత్సవాల సందర్భంగా పరకాల నియోజకవర్గం పరిధి గీసుకొండ మండలం ధర్మారంలో చోటు చేసుకున్న ఘటనపై ఆరా తీస్తోంది. ఈ ఘటన అటు పార్టీ అధిష్టానం.. ఇటు కేడర్‌లో గందరగోళానికి తెర తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన పరిస్థితులపై టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆరా తీసినట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముగ్గురు కాంగ్రెస్ సీనియర్లతో పాటు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఇద్దరితో ఆయన సోమవారం మాట్లాడినట్లు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది.

కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను బరిలోకి దింపింది. వరంగల్ తూర్పుతో పాటు పరకాల నియోజకవర్గం సీట్లను కొండా సురేఖ దంపతులు ఆశించారు. అయితే వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ, పరకాల నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పార్టీ అవకాశం కల్పించగా ఆ ఇద్దరూ గెలుపొందారు. కొద్ది రోజులు బాగానే ఉన్నా.. గీసుకొండ మండలంలో ఆధిపత్య రాజకీయాలు ఈ ఇద్దరు నేతల మధ్య విబేధాలు పొడచూపడానికి బీజం వేశాయి. భౌగోళికంగా గీసుకొండ పరకాల నియోజకవర్గంలో ఉండగా అక్కడ తనకు ఎన్నికల్లో సహకరించే ధోరణిలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఉండగా.. తమ సొంత మండలంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటున్నారని కొండా సురేఖ, ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో తమ అనుచరుడు గౌడ భరత్‌ను కాదని.. తాజా మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, వీరగాని రాజ్‌కుమార్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డితో గొడవ పడ్డారు. ఇందుకు సంబంధించి ఆ ఇద్దరు నేతల సెల్ ఫోన్ సంభాషణల ఆడియో కూడా బయటకు వచ్చింది. ఆతర్వాత కూడా ప్రొటోకాల్, ఫ్లెక్సీల వివాదాలు ఈ రెండు వర్గాల మధ్య జరిగాయి. రోజురోజుకూ గ్యాప్ పెరిగి కొండా సురేఖ, రేవూరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో దసరా ఉత్సవాల సందర్భంగా ధర్మారం ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే ఫొటోలను విస్మరించిన విషయమై రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం, ఘర్షణ గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు చేరగా.. అక్కడికి ఆటోలో వెళ్లిన మంత్రి సురేఖ అరెస్టయిన తన అనుచరులను విడుదల చేయాలని డిమాండ్ చేయడం కొత్త వివాదానికి తెరతీసింది. దసరా ఉత్సవాల సందర్భంగా ధర్మారంలో అసలు ఏం జరిగిందనే కోణంలో పార్టీ అధిష్టానం ఆరా తీస్తోంది.

అసలేం జరిగింది..!

దసరా వేడుకల సందర్భంగా మంత్రి కొండా సురేఖ అనుచరులు వేయించిన ఫ్లెక్సీలలో ఆ నియోజకవర్గం(పరకాల) ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటోలు వేయలేదు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు, మద్దతుదారులు కొండా సురేఖ తీరు, ఆమె అనుచరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొండా సురేఖ అనుచరులు ఎమ్మెల్యే వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. దీనిపై గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. అయితే తన అనుచరులను అరెస్ట్ చేయడంతో ఆగ్రహం చెందిన కొండా సురేఖ గీసుకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నానా హంగామా చేశారు. ఏకంగా సీఐ చాంబర్‌లోకి వెళ్లి కుర్చీలో కూర్చొని పోలీసులతో వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశంగా మారింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీసీపీ, ఏసీపీ, పోలీసులతో రంగంలోకి దిగిన పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గీసుకొండలో పరిస్థితి చక్కబడేలా చూశారు. అయితే అధికార పార్టీకి చెందిన మంత్రి ధర్నా చేయడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో వాగ్వాదానికి దిగడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో గీసుకొండ టోటల్ ఎపిసోడ్‌తో పాటు ఓరుగల్లు కాంగ్రెస్ తాజా రాజకీయాలపై టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ ఆరా తీస్తుండడం.. మరోవైపు ప్రభుత్వం సైతం ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా నివేదిక తెప్పించుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయనేది ఓరుగల్లులో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

న్యూస్‌రీల్

నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో సేవలు షురూ



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం శివారులో నూతనంగా నిర్మించిన నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో సోమవారం నుంచి ఓపీ సేవలు ప్రారంభించినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన భవనంలో ఓపీ సేవలు ప్రారంభించిన తొలిరోజు సోమవారం 180మంది రోగులు వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. జనరల్ ఓపీలో 108, జనరల్ సర్జన్ ఓపీలో 21, కంటి ఓపీ 11, దంత 03, ఈఎన్‌టీ 16, సైక్యాట్రిస్ట్ 1, చర్మం 29 మొత్తం 180మంది రోగులను వైద్యులు పరీక్షించారు. ల్యాబ్ పరీక్షలు 50, ఈసీజీ 15, డ్రెస్సింగ్ 04 చేయించుకున్నారు. అత్యవసర సేవలు మాత్రం పాత భవనంలోనే కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెట్ డాక్టర్ కిషన్, ప్రొఫెసర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

ఎంజీఎం : హైదరాబాద్ వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఈ నెల 16న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌కన్నా పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సమాన వేతనం చెల్లించాలని, అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తమకు మూల వేతనం చెల్లించాలని కోరారు.

చెత్త సేకరణలో జాప్యంతోనే సమస్యలు



వరంగల్ అర్బన్: ఇంటింటా చెత్త సేకరణలో జాప్యం కారణంగానే నగరానికి చెడ్డ పేరు వస్తోందని మేయర్ గుండు సుధారాణి అధికారులను హెచ్చరించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో పారిశుద్ధ్య వాహన మరమ్మతులు, ఇతర పనులపై ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో మేయర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వాహన మరమ్మతుల్లో జాప్యం వల్ల నగరంలోని చెత్త తరలింపులో ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందున, రిపేర్ కోసం షెడ్డుకు వచ్చే వాహనాలను ఎప్పటికప్పుడు రిపేర్ అయ్యేలా శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వాహనాల పీరియాడిక్ సర్వీసింగ్ దశలవారీగా నిర్వహించి మంచి కండిషన్లో ఉండేలా చూడాలని ఆదేశించారు. వాహనాల మరమ్మతుల టెండర్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, సీఎంహెచ్ఓ రాజిరెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్, ఈఈలు నరేందర్, సంతోశ్‌బాబు, డీఈలు కార్తీక్‌రెడ్డి, రాజ్‌కుమార్, రంగారావు, సారంగం, ఐటీ మేనేజర్ రమేశ్, ఏఈలు పాల్గొన్నారు.

వరల్డ్ హెరిటేజ్ క్యాంపు



వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్పలో నేటి(మంగళవారం) నుంచి ఈ నెల 26వ తేదీ వరకు వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు కొనసాగనుంది. యునెస్కో, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, భారత పురావస్తుశాఖ, తెలంగాణ పర్యాటక శాఖ, ఇంటాక్ ఆధ్వర్యంలో 12రోజుల పాటు చారిత్రక, పర్యాటక, వారసత్వ కట్టడాల గురించి దేశంలోని 24రాష్ట్రాలకు చెందిన 40 మంది వలంటీర్లకు అవగాహన కల్పించనున్నారు. 2008లో వరల్డ్ హెరిటేజ్ కార్యక్రమాన్ని యునెస్కో తొలిసారిగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ వారసత్వ కట్టడాలపై యువతి, యువకులకు అవగాహన కల్పిస్తారు. రామప్పలో తొలిసారిగా గతేడాది అక్టోబర్ మాసంలో 12రోజుల పాటు 40మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి రామప్ప ఆలయ నిర్మాణం, కాకతీయుల ఇంజనీరింగ్ టెక్నాలజీ, నాటి సంస్కృతీ, కళలు చరిత్రపై అవగాహన కల్పించారు. దీని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా రామప్ప ఆలయం గురించి వలంటీర్లు ప్రచారం నిర్వహించనున్నారు.

భూమి సమకూరిస్తే ఎయిర్‌పోర్టుకు చర్యలు

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



అమ్మవారి సన్నిధిలో మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

గీసుకొండ/హన్మకొండ కల్చరల్/కాజీపేట రూరల్: మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటుకు 400 ఎకరాల భూమి కావాలి.. సమకూరిస్తే చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రేటర్ వరంగల్‌కు స్మార్ట్ సిటీ కింది రూ.కోట్లాది నిధులు మంజూరు చేశామని, వాటిని పక్కదారి పట్టించడంతోపాటు సకాలంలో పనులు చేయడంలేదన్నారు. పుష్‌పుల్ రైలు గతంలో వరంగల్ నుంచి బయలుదేరేదని, ప్రస్తుతం కాజీపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండడంతో సామాన్య ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆ విషయం ఇప్పుడే తెలిసిందని, పరిశీలిస్తామన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని, గత బీఆర్ఎస్ సర్కారు తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా నాయకులు కొండేటి శ్రీధర్, ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేశాం..

దేశంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేశాం.. ఇంకా చేస్తున్నాం.. పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. కేంద్ర పర్యాటక శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులను అందజేస్తున్నామన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయాన్ని సందర్శించగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు కిషన్‌రెడ్డికి తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. అంతకు ముందు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీఓ వెంకటేశ్ మంత్రిని స్వాగతించారు.

నేడు నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్

- డీఈఓ జ్ఞానేశ్వర్



కాశీబుగ్గ సెంటర్ : జిల్లాలో డీఎస్సీ -2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు నేడు (మంగళవారం) ఉదయం 9:30 గంటల నుంచి పాఠశాలల కేటాయింపు కోసం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ సోమవారం తెలిపారు. ఈ కౌన్సిలింగ్ ప్రజాపరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉంటుందని ఒరిజనల్ నియామక పత్రం, హాల్ టికెట్, 3పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని హాజరు కావాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలకు పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని కేటగిరీల స్కూల్ అసిస్టెంట్లు, పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరు కాని వారికి మిగిలిపోయిన ఖాళీల్లో పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఖాళీల వివరాలు, మెరిట్ వివరాలు వెబ్‌సైట్ www. deowarangal.net లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

దరఖాస్తులపై త్వరగా స్పందించాలి

- నవంబర్‌లోగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు
- ప్రజావాణిలో కలెక్టర్ సత్యశారద



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ సెంటర్: కలెక్టరేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు త్వరగా స్పందించి పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి కారణాలను దరఖాస్తుదారులకు అధికారులు వివరించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యదేవిలు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 58 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి వేదికగా బానోత్ వీరన్న, నెక్కొండ మండలం దరఖాస్తుదారుడు ధరణి కరెక్షన్ నిమిత్తం దరఖాస్తు రాగా.. పరిష్కరించేందుకు ధరణి ఆపరేటర్ చక్రధర్‌కు ఆదేశించారు. దీంతో వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజావాణిలో ఎక్కువ మొత్తంగా రెవెన్యూ శాఖకి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇదిలా ఉండగా.. నవంబర్ మొదటి వారంలోగా కాటన్, ప్యాడి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈసారి రెండు రకాల ధాన్యాలను కొనుగోలు చేసేందుకు వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఎంజీఎం, సీకేఎం, ఏనుమాముల మార్కెట్ యార్డులో ఇందిర మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ జీఎం ఇండస్ట్రీస్, డీఆర్డీఓకు సూచించారు. సమావేశంలో వరంగల్, ఖిలావరంగల్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమేశ్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులే టార్గెట్!

- లీజు పేరుతో నెలనెలా కొందరి వసూళ్లు
- లబోదిబోమంటున్న చిరువ్యాపారులు
- చూసీచూడనట్లుగా ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు

వరంగల్ అర్బన్: రోడ్డును నమ్ముకుని చిరువ్యాపారులు చేసుకుంటూ జీవిస్తున్న పేదలను కొందరు నిలువు దోపిడి చేస్తున్నారు. ప్రధాన రహదారుల్లో, జంక్షన్లలో ఖాళీ స్థలాలు తమవే అంటూ రోజువారీగా, నెలకోసారి అద్దెల పేరుతో యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒప్పందం మేరకు డబ్బులు చెల్లించకపోతే పోలీసులు, రౌడీలతో వచ్చి గొడవలు చేస్తున్నారని చిరువ్యాపారులు కన్నీరుమున్నీరవుతున్నారు. సర్కారు స్థలాల్లో వీరి పెత్తనం ఏంటని చిరువ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

పొట్టకూటి కోసం..

చిరు వ్యాపారుల కోసం బల్దియా ఆధ్వర్యంలో రూ.3.54 కోట్లతో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్, సెయింట్ పాల్ స్కూల్ రోడ్డులో , కాశీబుగ్గ జంక్షన్, రెవెన్యూ కాలనీ రోడ్డులో హాకర్స్ జోన్లను నిర్మించారు. ఆయా కేంద్రాల్లో చిరు వ్యాపారం సాగడం లేదని అందులోకి వెళ్లేందుకు చిరువ్యాపారులు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో టీ షాపులు, మెకానిక్ షెడ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో చిరు వ్యాపారులు 90 శాతం మంది నగరంలోని రోడ్లకిరువైపులా, జంక్షన్లలో, రద్దీ ఉండే ఏరియాల్లోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరిలో గిరిగిరి(రోజువారీగా) వడ్డీకి తెచ్చుకుని వ్యాపారాలు సాగిస్తున్నవారే అనేకం.

అక్రమ వసూళ్లు

వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం నాయకుల పేరిట కొందరు. లోకల్‌గా ఏళ్ల కిందట తమ స్థలాలు తమ ఆధీనంలో ఉన్నాయని మరికొందరు. స్థానిక కార్పొరేటర్లమని ఇంకొందరు, వివిధ పార్టీల పేరుతో కొందరు. ఇలా.. పలుకుబడి కలిగిన చాలా మంది ఎవరికి వారుగా ప్రభుత్వ స్థలాలను తమ అడ్డాలుగా ఎంచుకున్నారు. అక్కడ చిరు వాప్యారం కొనసాగించేవారి నుంచి రోజువారీగా లేదా నెలకు రూ.100 నుంచి రూ.300 వరకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సొమ్ము చెల్లిస్తేనే తమ ఆధీనంలోని స్థలాల్లో వ్యాపారం చేసుకోవాలని నిబంధన పెడుతున్నారు. ఎవరైనా తిరగబడినా, లేదా డబ్బులివ్వకపోయినా ట్రాఫిక్ పోలీసులు, రౌడీలతో బెదిరింపులకు గురిచేస్తున్నారు.

బల్దియా, ట్రాఫిక్ సిబ్బంది సైతం..

చిరువ్యాపారులు రోజువారీగా ట్రాఫిక్ పోలీసులు, బల్దియా జవాన్లు, సిబ్బందికి మామూళ్లు ముట్టజెప్పాల్సిందేనని.. లేదంటే రోడ్డుపై సరుకులు, సామగ్రిన్లు విసిరేస్తూ బజారు పాలు చేస్తూ నష్టం కలిగిస్తున్నారని చిరువ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, పోలీసు ఉన్నతాధికారులకు ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వరంగల్ బస్ స్టేషన్ సమీపంలోని కమలమ్మ, సరోజన అనే చిరు వ్యాపారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎదిరించి తమను బెదిరింపులకు గురిచేస్తున్నవారి పేరు చెబుదామంటే.. ఉన్న జీవనోపాధి పోతుందేమోనని భయపడుతున్నారు.

అడుగంటుతున్న ఆకేరు

- పరివాహక ప్రాంతాల్లో మట్టిని తవ్వి ఇసుక ఫిల్టర్
- యథేచ్ఛగా సాగుతున్న దందా
- ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖల అధికారులు



మట్టిని లోడు చేస్తున్న కూలీలు



ఇసుక తరలిస్తున్న వారి వద్ద డబ్బులు వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టు



మట్టిని ఫిల్టర్ చేస్తూ..

వర్ధన్నపేట: ఆకేరు వాగు అడుగంటుతోంది. దీంతో ఇసుకాసురులు ఆకేరు వాగు ఒడ్డున ఉన్న భూముల్లో తవ్వుతూ ఆ మట్టిని ఫిల్టర్ చేసి ట్రాక్టర్ల ద్వారా నగరానికి తరలిస్తున్నారు. ఇలా రోజుకు వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఆకేరు పరివాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో 10 నుంచి 20 అడుగుల మేర లోతు తవ్వి ఆ మట్టిని ఫిల్టర్ చేసి నాణ్యత లేని ఇసుకను రవాణా చేస్తూ కొందరు అక్రమార్కులు దందా కొనసాగిస్తున్నారు.

ఆకేరు పరివాహకంలోనే ఎక్కువ

వర్ధన్నపేట పరిధిలోని ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలైన వర్ధన్నపేట, ఇల్లంద, ల్యాబర్తి, రాంధన్‌తండా, చంద్రుతండాల్లో ఆకేరు వాగు ఒడ్డున భూములను ఎంపిక చేసుకుని వాటిని జేసీబీ యంత్రాల ద్వారా తవ్వి మట్టిని ట్రాక్టర్లలో లోడు చేసి ఇసుక ఫిల్టర్ ద్వారా మట్టిని వేరు చేసి ఇసుకను తీస్తారు. ప్రైవేట్ భూముల్లో సైతం ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తవ్వి ఇసుకను తయారు చేసుకునేందుకు అనుమతి ఉండదు.. కానీ అక్రమార్జనకు అలవాటు పడిన వారు ఇష్టారాజ్యంగా తవ్వుతూనే ఉన్నారు. ఇసుక ఫిల్టర్ చేసే మిషన్లు 20కి పైగా ఉండగా, జేసీబీలు ఈ ప్రాంతాల్లో 10కి పైగా 360 రోజులూ నడుస్తూనే ఉండడం గమనార్హం.

వరంగల్‌కు తరలుతున్న 400 ట్రాక్టర్ల ఇసుక..

ఇసుక ఫిల్టర్ చేసిన తర్వాత ఆయా ప్రాంతాల నుంచి ఇసుక ట్రాక్టర్లు రోజూ వరంగల్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. అయితే ట్రాక్టర్లు ఇసుక లోడు చేసుకున్న తదుపరి ఆయా ప్రాంతాల్లో ఇసుక సిండికేట్ ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టు వద్ద ఆగి రూ.200 చెల్లించి బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ డబ్బులు అధికారులకు ఇచ్చే మామూళ్లు, ఇతర ఖర్చులకు వినియోగిస్తారని తెలిసింది. ప్రతీరోజు తెల్లవారు జామున 2 నుంచి 4గంటల వరకు ఇసుక ట్రాక్టర్లు వరంగల్ నగరానికి చేరేలా వీరి ప్రణాళికలు ఉంటాయని సమాచారం. వర్ధన్నపేట, మామునూరు, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధి దాటి నగరానికి ఈ ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చోద్యం చూస్తున్న సంబంధిత శాఖలు

ఇసుక అక్రమ రవాణా, మట్టి తవ్వకాలు, ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకుండా ఉండడానికి మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు పని చేయాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినపుడు మాత్రం మైనింగ్, రెవెన్యూ శాఖలు హల్‌చల్ చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు వ్యవహరిస్తారు. అయినా ఇప్పటి వరకు పెద్దగా కేసులు చేసిన దాఖలాలు మాత్రం లేవు. బహిరంగంగా జేసీబీ యంత్రాలతోనే మట్టిని తవ్వి ఇసుక చేస్తున్నా వారికి కనబడదు. అధికారులు ఇలానే వదిలేస్తే భూగర్భ జలాలు అడుగంటడంతోపాటు వ్యవసాయ భూములు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు తీసిన మట్టి, ఇసుక కోసం తవ్విన గోతులు ప్రమాదాలకు నిలయంగా మారే అవకాశం లేకపోలేదు. అయితే మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించకపోతే రాబోయే రోజులు ప్రమాదకరంగా మారుతాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక రవాణాను నియంత్రించాలి



ఇసుక అక్రమ రవాణాను అధికారులు నియంత్రించాలి. మట్టి నుంచి ఇసుక ఫిల్టర్ వల్ల ఇసుకలో నాణ్యత లేకుండా పోతోంది. కేవలం నామ మాత్రపు కేసులు నమోదు చేసి మమ అనకుండా చిత్తశుద్ధితో నియంత్రించాలి.

- తుమ్మల కుమారస్వామి, వర్ధన్నపేట

అధికారుల వైఫల్యంతోనే..



అధికారుల వైఫల్యంతోనే నిరాటకంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. బహిరంగంగానే ఇసుక అక్రమ రవాణా వల్ల ఆయా శాఖల అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నియంత్రణ చర్యలు చేపట్టాలి.

- ఈరెల్లి శ్రీనివాస్, వర్ధన్నపేట

సీసీఎస్‌ను పోలీసులే మానిటరింగ్ చేయాలి

- పురపాలక శాఖ డైరెక్టర్ వీపీ.గౌతమ్
- కమాండ్ కంట్రోల్ రూమ్ పనుల పరిశీలన

వరంగల్ అర్బన్: బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉన్న కమాండ్ కంట్రోల్ సిస్టమ్ (సీసీఎస్)ను పోలీసులే మానిటరింగ్ చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ వీపీ.గౌతమ్ అన్నారు. ఆయన సోమవారం వరంగల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ పనుల నిర్లక్ష్యంపై ఇంజినీర్లు, సంబంధిత కాంట్రాక్ట్ తీరును తప్పుపట్టారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఏసీటీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్‌ను పోలీసులే మానిటరింగ్ చేయాలి.. ఇందుకు ఆ సిస్టమ్‌ను వారికి అప్పగించాలని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం కేటాయించిన వాహనాలను వేరు చేయడంతోపాటు వాటిని బల్దియా అధికారులు నిత్యం మానిటరింగ్ చేసి సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అందజేయాలని సూచించారు. ఇందుకు జీడబ్ల్యూఎంసీ నుంచి అధికారిని కేటాయించాలని పేర్కొన్నారు. పోతన నగర్‌లోని లాండ్రో మార్ట్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను మేయర్ సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సీడీఎంఏ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ లాండ్రో మార్ట్‌లో రజక సంఘాలతో పాటు రజక సంఘానికి చెందిన స్వయం సహాయక మహిళా సభ్యులు సుమారు 100 మందికి ఉపాధి కల్పించడానికి చర్యలు చేపడతామని చెప్పారు. స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్లతో చెత్త సేకరణ, తరలింపు విధానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్, అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు రాజయ్య, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేష్, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణారెడ్డి, రవీందర్, ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ మహేందర్, డీఎంసీ రజితారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూ రిజిస్ట్రార్ అడ్డగింత

● పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్



కేయూ క్యాంపస్: తమకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పరిపాలన భవనం వద్ద నలుగురు అభ్యర్థులు రిజిస్ట్రార్ మల్లారెడ్డిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వాగ్వాదానికి దిగారు. దీనికి రిజిస్ట్రార్ స్పందిస్తూ ఇప్పటికే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందన్నారు. తాను ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణను కలిసేందుకు హైదరాబాద్ వెళ్తున్నానని, అడ్డుకోవడం సరికాదన్నారు. మరో కమిటీ వేసి అవకాశం ఉంటే పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని అభ్యర్థులు రిజిస్ట్రార్‌కు విన్నవించారు. కమిటీ వేసేందుకు తాను ఇన్‌చార్జ్ వీసీ దృష్టికి తీసుకెళ్లి కోరుతానని చెప్పి రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కాగా, పోలీసు అధికారులు పరిపాలన భవనం వద్దకు చేరుకుని సర్దిచెప్పే యత్నం చేశారు.

వినియోగదారుల హక్కుల రక్షణలో బీఐఎస్ కీలకం



హన్మకొండ: వినియోగదారుల హక్కుల రక్షణలో భారత ప్రమాణాల సంస్థ (బి.ఐ.ఎస్) ప్రధాన పాత్ర వహిస్తుందని ఆల్ ఇండియా కన్జ్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, కన్జ్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ సీనియర్ సెక్రటరీ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. అక్టోబర్ 14 ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘ కార్యాలయంలో వినియోగదారుల చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులు, సరుకులు, రసాయనాలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, యంత్రాలు, తదితర వస్తువులను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ వారి ప్రయోగశాలకు పంపించి వారి ఉత్పత్తుల స్వచ్ఛత, ప్రమాణాలను సూచించే సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బి.ఐ.ఎస్) వారు జారీచేసే సర్టిఫికెట్‌లో ప్రత్యేక కోడ్ నంబర్ ఇస్తారన్నారు. ఐ.ఎస్.ఐ మార్క్ కలిగిన వస్తువులనే వినియోగదారులు కొనుగోలు చేయాలన్నారు. ప్రముఖ న్యాయవాది మల్యాల మనోహర్ రావు, జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు ఇందిర, కవిరాజ్, సతీశ్, మంజుల, సాయితేజ పాల్గొన్నారు.

పదినెలల చిన్నారికి డెంగీ

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని పెద్దతండాకు చెందిన పదినెలల చిన్నారి బానోత్ దర్శిత్‌కి డెంగీ పాజిటివ్ అని తేలడంతో తల్లిదండ్రులు ఎంజీఎంలో చికిత్స చేయిస్తున్నారు. కాగా, గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జీవనాధారం ఇచ్చాం.. ఉపాధి కల్పించండి

రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్న అయోధ్యపురం రైతులు

● 114 మంది రైతులు.. 160 ఎకరాల భూమి
● రైల్వే వ్యాగన్ పరిశ్రమకు అన్నదాతల భూమి



చకచకా జరుగుతున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులు

కాజీపేట అర్బన్ : 'మా జీవనాధారం.. వ్యవసాయ భూమి. రైల్వే వ్యాగన్ పరిశ్రమకు మా పంట భూమి ఇచ్చి ఉపాధి కోల్పోయాం. అందుకే మాకు ఉపాధి కల్పించి ఆదుకోండి' అంటూ కాజీపేట మండలంలోని అయోధ్యపురం గ్రామ రైతులు వేడుకుంటున్నారు. తాత ముత్తాతల కాలం నుంచి వారసత్వంగా అయోధ్యపురంలోని 114 మంది రైతులు 160 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పది సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వేకు అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ పరిశ్రమ నెలకొల్పేందుకు గాను ఆయా 114 మంది రైతుల నుంచి 160 ఎకరాల భూమిని సేకరించింది. అంతే అప్పటి నుంచి సదరు రైతులు తమ జీవనాధారం కోల్పోయారు. పని దొరికితేనే కుటుంబం గడుస్తోంది. లేని పక్షంలో పస్తులుంటున్నారు.

వర్చువల్‌గా పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ..

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ.. అయోధ్యపురంలో గతేడాది వ్యాగన్ తయారీ పరిశ్రమతో పాటు పిరియాడికల్ ఓవరాలింగ్ పరిశ్రమకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సుమారు రూ. 521 కోట్ల వ్యయంతో పరిశ్రమను పూర్తి చేసేందుకు చేపడుతున్న పనులు చకచకా కొనసాగుతున్నాయి. అయితే నాడు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిన రైల్వే, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు నేడు పట్టించుకోవడం లేదు. దీనిపై ఇప్పటికైనా స్పందించి తమకు ఉపాధి కల్పించాలని సదరు రైతులు వేడుకుంటున్నారు.

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి

అయోధ్యపురంలో నిర్మాణంలో ఉన్న వ్యాగన్ తయారీ పరిశ్రమ, పిరియాడికల్ ఓవరాలింగ్ పరిశ్రమలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి లభించనుంది. కాగా, ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఔట్ సోర్సింగ్ రూపంలో ఉపాధి కల్పించాలని అయోధ్యపురం రైతులు వేడుకుంటున్నారు. రైల్వే జీఎం, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు.

పనిలేక ఇబ్బంది పడుతున్నాం



నేను సాగు చేసుకునే రెండు ఎకరాల భూమిని రైల్వే పరిశ్రమకు తీసుకున్నారు. దీంతో అటు పంట పండించేందుకు భూమి లేక.. ఇటు చేసేందుకు పనిలేక ఇబ్బందులు పడుతున్నా. గతంలో 114 మంది రైతులం 160 ఎకరాల్లో వరి, పత్తి, పచ్చ, తెల్ల జొన్న వంటి పంటలను పండించుకుని ఇతరులకు పని కల్పించే వాళ్లం. ఇప్పుడు మాకు పని దొరకడం లేదు. - గాదం యాదగిరి, రైతు, అయోధ్యపురం

మా పిల్లలకు ఉపాధి కల్పించండి



మా తాతల నుంచి సాగు చేసుకుంటు నాలుగు ఎకరాల భూమిని రైల్వే పరిశ్రమకు ఇచ్చాం. దీంతో మా పిల్లలకు ఉపాధి లేకుండా పోయింది. మా పిల్లలకు రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమలో ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

- వీరన్న, రైతు, అయోధ్యపురం

నమ్మించి.. నట్టేట ముంచి

● రైతు వద్ద నుంచి రూ.40 వేలు ఎత్తుకెళ్లిన దుండగులు
● సీతారాంపురంలో ఘటన



సీతారాంపురంలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల : ఓ రైతు బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని ఇంటికెళ్తుండగా దుండగులు నమ్మబలికి రూ.40 వేలు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం మండలంలోని సీతారాంపురంలో చోటుచేసుకుంది. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని రంబోజీగూడేనికి చెందిన రైతు పెండ్లి మల్లయ్య సింగరాజుపల్లిలోని ఏపీజీవీబీకి వెళ్లి రూ. 40 వేలు డ్రా చేసుకున్నాడు. అనంతరం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సీతారాంపురంలోని దుర్గమ్మ గుడి ప్రాంతంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అతడిని వెంబడించారు. మీ డబ్బులు కిందపడ్డాయి.. చూసుకో అని చెప్పగా సదరు రైతు మల్లయ్య.. వాహనం ఆపి కిందపడిన డబ్బులు తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో దుండగులు చాకచక్యంగా బాధితుడు తన వాహనంలో భద్రపరిచిన డబ్బులు తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై ఊర సృజన్‌కుమార్, సిబ్బంది యాకుబ్, యాకేశ్ ఉన్నారు.

కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

నల్లబెల్లి: కడుపు నొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని లెంకాలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదం మంజుల(30) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పి ఎంతకూ తగ్గకపోవడంతో ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త రాజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు నాగబోయిన నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి వృద్ధురాలు..

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. మండలంలోని బోల్లోనిపల్లికి చెందిన మియాపు రంగుగుణ(72) గత కొంతకాలంతో అనారోగ్యంతో బాధపడుతోంది. ఎంతకూ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు మియాపురం ఆచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు.

డిగ్రీ, పీజీ కళాశాలలు రీఓపెన్‌కు నో

● కళాశాలల గేట్‌ల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసిన యాజమాన్యాలు



హనుమకొండ హంటర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాల గేట్‌కు ఏర్పాటు చేసిన బ్యానర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు సోమవారం నుంచి రీఓపెన్ చేయలేదు. మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని, దీంతో తాము కళాశాలలను నడిపే పరిస్థితి లేకపోవడంతో ఇక నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రం సమర్పించిన విషయం విదితమే. హనుమకొండలో వివిధ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల గేట్లకు బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో వివిధ కళాశాలలకు వచ్చిన విద్యార్థులు వెనుదిరిగారు. తాము అనేక ఇబ్బందులుపడుతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని అసోసియేషన్ బాధ్యులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో నిరవధికంగా బంద్ చేయనున్నట్లు వెల్లడించారు.

నూనె గింజల సాగు అధికంగా చేపట్టాలి

● కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న

మామునూరు: యాసంగిలో నూనె గింజల పంట సాగు అధికంగా చేపట్టాలని మామునూరు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా సోమవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్త సౌమ్య ఆధ్వర్యంలో యాసంగి వేరుశనగ పంటలో చీడపీడల నివారణపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు టీసీ జీఎస్ 1694 రకం విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రైతులు నూనె గింజ పంటలలో సుస్థిరత సాధించడానికి సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా నూనె గింజ పంటల సాగు చేయాలన్నారు. రాష్ట్రంలో 1.6 నుంచి 1.7 లక్షల హెక్టార్లలో ఈనూనె గింజ పంట సాగవుతుందని, ఈపంటను యాసంగిలో ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండో పక్షంలోపు , దక్షిణ తెలంగాణలో సెప్టెంబర్ మొదటి పక్షం నుంచి నవంబర్ రెండో పక్షం వరకు విత్తుకోవచ్చని సూచించారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త రాజు.. విత్తుకునే పద్ధతి, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, విత్తన మోతాదు, వివిధ రకాల చీడ పీడలు, వాటి నివారణ చర్యలపై రైతులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి కిరణ్, గణేశ్, శశాంక్, హర్ష, సాయి చంద్, తదితరులు పాల్గొన్నారు.

16,17వ తేదీల్లో క్రికెట్ ఎంపికలు



మాట్లాడుతున్న వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 16, 17వ తేదీల్లో అండర్-23 విభాగంలో ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ మండిబజార్‌లోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల స్థాయిలో నిర్వహించే జట్ల ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన ఆరు జట్లు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. క్రీడాకారులు సెప్టెంబర్01, 2001 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వెంట జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మీసేవ నుంచి పుట్టిన తేదీ సర్టిఫికెట్, క్రికెట్ కిట్టుతో హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు రఘురాం, ఎస్‌కె నదిముద్దీన్, జాయింట్‌సెక్రటరీ ఉపేందర్, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, అభినవ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

● అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందకట్ల స్వామి



విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న పోపా ప్రతినిధులు

రామన్నపేట : పద్మశాలీ కులస్తులు అన్ని రంగాల్లో రాణించడంతోపాటు ప్రధానంగా రాజకీయాల్లో ఎదిగేలా ముందుకు సాగాలని అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందకట్ల స్వామి పేర్కొన్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా పోపా ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడలోని పద్మశాలీ భవన్‌లో విద్యార్థులకు ప్రతిభ పురస్కార అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్ రాజకీయాలకు విద్యార్థులు, యువత సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథి కమ్మర్ల మురళి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యనభ్యసిస్తూ సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శామంతుల శ్రీనివాస్, ప్రతిభ అవార్డు కమిటీ చైర్మన్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, సాంబారి సమ్మరావు, కుసుమ సతీశ్, గుండేటి నరేంద్రకుమార్, మాటేటి అశోక్, మాటేటి సంతోశ్, రాజగోవిందు, చిప్ప వెంకటేశ్వర్లు, తుమ్మ రమేశ్, బైరి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్‌ఫ్రీ నంబర్లు 18004250028, 1912 ఏర్పాటు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని సర్కిళ్ల ఎస్ఈ, డీఈలతో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. లూజు లైన్లు, తుప్పు పట్టిన, కాలం చెల్లిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్ ప్లింత్‌లను, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్, ఇండక్షన్ ఎఫెక్ట్‌లను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు , సీజీఎంలు కిషన్, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగకు వచ్చి.. పరలోకానికి

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వీరాంజనేయులు (ఫైల్)

కొడకండ్ల : జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి దసరా పండుగకు సొంతూరికి వచ్చి తల్లిదండ్రులతో గడిపి, అత్తారింటికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. నర్సింగాపురం గ్రామానికి చెందిన కప్పల వీరాంజనేయులు(41) రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ రామంతాపూర్‌లో ఉంటున్నాడు. దసరా సెలవులు రావడంతో భార్య, పిల్లలను పాలకుర్తి మండలం వల్మిడిలోని అత్తారింటికి పంపి తను తల్లిదండ్రుల వద్ద దసరా వేడుకలు జరుపుకున్నాడు. కాగా, ఆదివారం ఉదయం టీవీఎస్ వాహనంపై అత్తారింటికి వెళ్లి వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో స్పృహ కోల్పోయాడు. చికిత్స నిమిత్తం జనగామకు తరలిస్తుండగా మృతిచెందాడు. పండుగ సెలవులకొచ్చి తమతో గడిపిన వీరాంజనేయులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నర్సింగాపురంలో విషాదం నెలకొంది. సోమవారం వీరాంజనేయులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బావిలో పడి వివాహిత మృతి



అనిత(ఫైల్)

సంగెం: మానసిక స్థితి సరిగా లేని ఓ వివాహిత పండుగకు పుట్టింటికి వచ్చి బావిలో పడి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కాట్రపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లకొండ పాపయ్య కూతురు అనిత(35)ను 2008లో దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన ఉండ్రాతి రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. 10 ఏళ్లుగా అనిత మానసిక వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో దసరా పండుగకు పుట్టింటికి వచ్చింది. సోమవారం తెల్ల వారుజామున లేచి చూడగా అనిత కనిపించలేదు. దీంతో పలు చోట్ల వెతకగా చివరకు గ్రామానికి చెందిన జయపాల్‌రెడ్డి వ్యవసాయ బావి లో మృతి చెంది కనిపించింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..

రఘునాథపల్లి: మండలంలోని రఘునాథపల్లి– ఇప్పగూడెం రైల్వే స్టేషన్ మధ్య సోమవారం గుర్తు తెలియని రైలు నుంచి పడి దాదాపు నలభై సంవత్సరాల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జనగామ జీఆర్ పోలీసుల కథనం ప్రకారం.. సదరు వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు ట్రాక్‌పై పడి ఉంటాడని, కుడి చేతిపై నాన్న అనే పచ్చబొట్టు.. గెడ్డం పెరిగి ఉందని తెలిపారు. ఘటనా స్థలిని సందర్శించి మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలకు 9440027342, 9010100958 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చీడ.. పీడ

వరి పంటను ఆశిస్తున్న పురుగులు

● నివారణకు ప్రత్యేక సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
● రైతులకు మల్యాల కేవీకే సమన్వయ కర్త ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ సూచనలు



వరి పంటకు ఆశించిన ఆకు ఎండు తెగులు, కాండం తొలుచు పురుగు, సుడి దోమ



డాక్టర్ ఎస్.మాలతి



బి.క్రాంతికుమార్

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో సాగవుతున్న ప్రధాన ఆహార పంటల్లో ముఖ్యమైనది వరి. ప్రస్తుతం వరి పంటను చీడపీడలు ఆశించి రైతులకు దడ పుట్టిస్తుండగా...ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు చాలావరకు పంట నష్టం జరగడం రైతులను తీవ్ర మనోవేదనకు గురిచేసింది. అలాగే, చాలా వరకు సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు చీడపీడల ఉధృతి పెరిగి వరి పంటకు ఇబ్బందికరంగా తయారైంది. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు, సుడి దోమ, బ్యాక్టీరియా ఎండు తెగులు ఆశించి నష్టం చేస్తుండగా వాటి నివారణకు ప్రత్యేక సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ సూచిస్తున్నారు.

కాండం తొలిచే పురుగు..

వరి పిలక దశలో కాండం తొలిచే పురుగు ఆశించినప్పుడు మొవ్వులు ఎండిపోయి చనిపోతాయి. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తరువాత తెల్ల కంకులు వస్తాయి.

కారణాలు..

ముదురు నారు నాటడం, తక్కువ ఉష్ణోగ్రత, కరువు పరిస్థితులు, తక్కువ నత్రజని వాడకం.

నివారణ చర్యలు..

ప్రస్తుతం వరి నాటు వేసి 55 నుంచి 60 రోజులు కావొస్తున్న నేపథ్యంలో కాండం తొలిచే పురుగు ఆశించగా దాని నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4 జి గుళికలను 8 కిలోలు లేదా క్లోరంట్రా నిలిప్రోల్ 0.4జి గుళికలు నాలుగు కిలోలు లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ రెండు గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల 18.5 ఎస్పీ 0.3 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ..

వానాకాలం సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు ముఖ్యంగా గోధుమ రంగు దోమ, తెల్ల వీపు దోమలు ఆశించడం అధికంగా ఉంటుంది. పిల్ల, పెద్ద దోమలు నీటిపై భాగంలో దుబ్బుల మొదళ్ల దగ్గర నుంచి రసం పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. అధిక ఉధృతి ఉన్నప్పుడు పొలం పైభాగంలో నీరు తెట్టులాగా తేలియాడుతూ కనిపిస్తుంది. పైరు సుడులు సుడులుగా వలయాకారంలో కనబడుతుంది. తరువాత పొలం ఎండి పడిపోవడం, తాలు గింజలు అవుతాయి.

కారణం..

అధిక నత్రజని వాడకం, కాలిబాటలు తీయకపోవడం, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడం.

నివారణ..

తొలి దశలో ఉధృతి గమనిస్తే ఎసిఫేట్ 75 ఎస్పీ 1.05 ఐదు గ్రాములను లీటర్ నీటికి అలాగే ఉధృతి అధికమైతే డైనోటెఫ్యూరాన్ 20 ఎస్.జి 0.4 గ్రాములు లేదా బ్యూప్రొఫెజన్ 1.6 మిల్లీ లీటర్లు లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 శాతంతోపాటు ఎథిప్రోల్ 40 శాతాన్ని 0.25 గ్రాములు చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు..

దుబ్బులు చేసే దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి వీటి చుట్టూ డాగు మచ్చలుగా మొదలవుతాయి. అంచుల వెంబడి అలల మాదిరి పైనుంచి క్రమేపి మట్టల వరకు వ్యాపిస్తాయి. పసుపుపచ్చని జిగురు వంటి బ్యాక్టీరియా ఎండ వేడిమికి గట్టిపడే చిన్న ఉండలుగా ఏర్పడతాయి.

కారణాలు..

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, అధిక తుపాన్లు, వర్షపాతం నమోదు, ఉష్ణోగ్రత 22 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ ఉండడం వల్ల తెగులు ఆశించిన తర్వాత నత్రజని ఎరువులను వాడడం వల్ల ఆకులకు ఎండు తెగులు సోకుతుంది.

నివారణ..

నత్రజని తక్కువ వాడడం అరికట్టేందుకు అగ్రి మైసిన్ 0.4 గ్రాముల లేదా ప్లాంటోమైసిన్ లేదా పోషామైసిన్ 0.2 గ్రాములను ఐదు నుంచి ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మురుగు నీటిని కాలువల ద్వారా బయటకు తీసివేయాలి.